క్లుప్తంగా

రామాపురం వీఆర్వో సస్పెన్షన్

దాచేపల్లి : మండలంలోని రామాపురం గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.శివశంకర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో జరిగిన జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీ సర్వేలో వీఆర్వో శివశంకర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో స్థానిక డివిజనల్, మండల రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగా వీఆర్వో శివశంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా వీఆర్వో శివశంకర్ వ్యవహార శైలిపై పలువురు రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

14 మంది టీడీపీ వర్గీయుల అరెస్టు

వెల్దుర్తి: గొట్టిపాళ్ళ గ్రామంలో ఆగస్టు 29న జరిగిన ఘర్షణకు సంబంధించి టీడీపీకి చెందిన 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.శ్రీహరి గురువారం చెప్పారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జక్కుల వెంకటేశ్వర్లు, రాజబోయిన ప్రసాద్, బూడిద బాలయ్యతో పాటు మరో 11 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిని మాచర్ల మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి శారదాదేవి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గురజాల : బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ మధ్యంతర ఉత్తర్వుల పిటిషన్లపై 20 రూపాయల స్టాంప్ విడిగా అంటించాలనే ఆదేశాలు జారీ చేయడంతో దీనిని నిరసిస్తూ గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాషా మాట్లాడుతూ రెండు రోజుల పాటు విధులకు హాజరుకావడం లేదన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన న్యాయవాది కలివెల ప్రభుదాసును పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సుందరజ్ఞానమ్మ, కోట శ్రీనివాసరావు, కత్తి చలమరాజు, చల్లా రామిరెడ్డి, క్రా చినకోటేశ్వరరావు, కె.హరిసత్యనారాయణ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



దాచేపల్లి : గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. నారాయణపురంలోని ఫ్లైఓవర్ సమీపంలో సుమారు 50 సంవత్సరాల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లుగా స్థానికులు గుర్తించారు. ఎస్ఐలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి ఘటన స్థలంలో మృతదేహం పరిశీలించి పోస్ట్ మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.

విజయలక్ష్మి లాంచీ విజయవాడకు తరలింపు



విజయపురిసౌత్: పర్యాటక కేంద్రమైన విజయపురిసౌత్‌లోని లాంచీయూనిట్‌లో మరమ్మతులకు గురైన విజయలక్ష్మి లాంచీని విజయవాడకు తరలిస్తున్నారు. విజయలక్ష్మి లాంచీని 1964 సంవత్సరంలో అనుపు వద్ద ప్రారంభించారు. సాగర్ నుంచి నాగార్జునకొండకు వెళ్ళే మొట్టమొదటి లాంచీగా విజయలక్ష్మి పేరుగాంచింది. 39 సంవత్సరాలుగా విజయపురిసౌత్ పర్యాటక కేంద్రంలో సేవలందించిన విజయలక్ష్మి గత కొంతకాలంగా మరమ్మతులకు గురైంది. ఈ లాంచీని విజయవాడ బరంపురం పార్కుకు తరలించి మరమ్మతుల అనంతరం పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తారని పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు క్రికెట్ బెట్టింగ్‌లు, లాటరీలు, సింగిల్ నెంబర్లు, పేకాట వంటి వాటిపై ఉక్కుపాదం మోపామన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచటం జరుగుతుందన్నారు.

అంబేడ్కర్ నగర్ కాలనీలో ట్రైనీ కలెక్టర్ పర్యటన

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం పరిధిలోని అంబేడ్కర్ నగర్‌కాలనీని పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మౌలిక వసతులపై కాలనీవాసులతో మాట్లాడారు. గతంలో స్పందన కార్యక్రమంలో కాలనీవాసులు రోడ్లు లేవని, ఎస్‌ఎస్పీ కాలనీపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ముఖ్యంగా పాఠశాలను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. దీనిలో భాగంగా ట్రైనీ కలెక్టర్ సర్పంచ్ రామాంజనేయులుతోను, స్థానిక అధికారులతో కలసి కాలనీలోని వసతులపై ఆరా తీశారు. పాఠశాలను వచ్చే ఏడాది ఏర్పాటు చేస్తామని, త్వరలో బ్రిడ్జిని నిర్మిస్తామని తెలిపారు. తాగునీటి వసతికూడా కల్పిస్తామని తెలిపారు. తహసీల్దార్ ఉన్నీస్సాబేగం, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జున శర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి సురక్ష



కంటి వైద్య సేవలు పొందుతున్న ప్రజలు



దైద గ్రామంలో ఓపీకి బారులు తీరిన ప్రజలు



దైద గ్రామంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



జగనన్న సురక్ష శిబిరంలో గర్భిణికి హెల్త్ కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో తీసుకువస్తున్న మార్పులు పేదలకు ఒక వరం అని తహసీల్దార్ మీసాల దానియేలు అన్నారు. మండల పరిధిలోని దైద గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరిగిందన్నారు. పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయడం జరిగిందన్నారు. స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై బాలింతలు , గర్భిణులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, వైద్యులు తదితరులున్నారు.

విజయపురిసౌత్: ప్రజల ఆరోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. గురువారం మాచర్ల మండలం చింతలతండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం పేదవాడి వైద్యంపై ఇంత శ్రద్ధ చూపలేదన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రోగ నిర్ధారణ పరీక్షలు చేయటమే కాకుండా ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా సేవలు, మందులు అందిస్తున్నారన్నారు. అనంతరం గర్భిణులకు హెల్త్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎంపీడీవో సరోజినిదేవి, జెడ్పీటీసీ మల్లుస్వామి, సర్పంచ్ కేతావత్ శ్రీను, ఎంపీటీసీ సీతానాయక్, ఈవో కోటేశ్వరరావు, కొప్పునూరు పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్, షేక్ ముత్యార్‌జాని, తాళ్ళపల్లి పీహెచ్‌సీ వైద్యులు వెస్లీ, కంభంపాడు పీహెచ్‌సీ వైద్యులు ప్రదీప్, సురేష్, ఉప సర్పంచ్ లచ్చునాయక్, కొత్తపల్లి సర్పంచ్ జయప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్, హనుమంతునాయక్, ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యమే లక్ష్యం

వెల్దుర్తి: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని బోదిలవీడు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీఓ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. ఐదు దశల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అనారోగ్యానికి గురైన వారిని ఆరోగ్యవంతుల్ని చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ శిబిరంలో 286 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 156 మంది మహిళలు, 130 మంది పురుషులు ఉన్నారు. ఏడుగురు రిఫరల్, ఏడు రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి వారికి ఇంటి వద్దనే మందులు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంగులూరి లక్ష్మయ్య, ఎంపీటీసీ మేదరమెట్ల పార్వతమ్మ, ఉప సర్పంచ్ నంబూరి కృష్ణమూర్తి, తహసీల్దార్ కోటేశ్వరరావు, వైద్యాధికారి కౌసిక్, ముఖర్జీ, మహతి, ఆశీర్వాదం , నాగరాజు, నిజాముద్దీన్, ఈఓపీఆర్‌డి మకట్ లాల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సుకే జగనన్న ఆరోగ్య సురక్ష

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష మన రాష్ట్రంలో పేదలందరికి ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి వెంటనే వైద్య సహాయం అందచేయనున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న విప్లవాత్మకమైన పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. సీఎం జగన్ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య, ఆరోగ్య రంగంలో ఒక విప్లవం అన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మాట్లాడుతూ 307 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మిసీతారామి రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, కొమ్మారెడ్డి మర్రెడ్డి, బొంకూరి తిరుపతి రావు, ఆరికట్ల బ్రహ్మారెడ్డి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరించండి

పంపుహౌస్ మరమ్మతు పనులు పరిశీలనలో ప్రభుత్వ విప్ పీఆర్కే



పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, చైర్మన్ చిన ఏసోబు, కమిషనర్ రమణబాబు

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ పంపుహౌస్‌లో బుధవారం వాక్యూమ్ మోటార్ మరమ్మతులకు గురైంది. దీంతో పురపాలక సంఘ పరిధిలోని నీటి సరఫరా నిలిచిపోవటంతో మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, కమిషనర్ రమణబాబులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు వెంటనే విజయవాడ నుంచి వాక్యూమ్ నూతన మోటార్‌ను తీసుకొనివచ్చి శరవేగంగా పనులు కొనసాగించారు. పట్టణ ప్రజలకు నీటి సరఫరాలో ఏర్పడిన సమస్యను విచారించి మరమ్మతు పనులను పీఆర్కే గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాత్రిలోపు పనులు పూర్తి చేసి మంచి నీటి సరఫరా పునరుద్ధరించాలన్నారు. పీఆర్కే వెంట మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, కమిషనర్ రమణబాబు, డీఈ ఓలేటి మధుసూదనరావుతో పాటు పలువురున్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



గురజాల : చిన్న మసీదు సెంటర్‌లోని కాలేషావలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రతి ఒక్కరూ దేవుని దయ కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్‌లు షేక్ బడే జానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, షేక్ నాగులుమీరా, హుస్సేన్, సతీష్, వైద్యుడు టీడీపీ నాయకుడు చల్లగుండ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న దుర్గి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుర్గి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో అండర్ 14 బాలుర విభాగంలో దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందినట్లు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పి.కోటేశ్వరమ్మ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పానుగుపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పోటీలో 8వ తరగతి చదువుతున్న మంద ముత్తయ్య, అందుగుల దాసులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు వివరించారు. శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపి మాట్లాడుతూ పల్నాటి ప్రాంతం నుంచి ఎంపిక కావటం పట్ల అభినందనలు తెలిపారు. పీఈటీ బండ్ల ప్రసాద్‌ను విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

దసరా ఉత్సవాల పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దేవాలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల, ఆర్యవైశ్య సంఘ పెద్దలు

కారెంపూడి : శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆర్యవైశ్య సంఘ పెద్దలు గురువారం రాత్రి ఆవిష్కరించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు సమావేశమై ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఉత్సవాల ప్రత్యేక పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చీతిరాల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ సూరె అంకారావు, కరాలపాటి సుబ్బారావు, ఇమ్మడి వీరేశ్వరరావు, పొట్టుమూర్తి పుల్లారావు, గుండా శ్రీనివాసరావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు యక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

100 మంది దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

మాచర్ల: పట్టణానికి చెందిన రోటేరియన్ తుమ్మల సత్యప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని మాచర్ల పట్టణ, పరిసర ప్రాంతాలలోని 100 మంది దివ్యాంగులకు రూ.10వేల నగదు ఆర్టీసీ సూపరింటెండెంట్ మురళి, జోజికి అందజేసి వారు మంజూరు చేసిన బస్‌పాస్‌లను దివ్యాంగులకు ఉచితంగా అందించారు. గురువారం బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ జిల్లా కమిటీ సభ్యులు కొండవీటి రామకోటయ్య, అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, నాగూర్‌వలిలు మాట్లాడుతూ సత్యప్రసాద్ ముందుకొచ్చి 100 మందికి ఉచిత బస్సు పాస్‌లు అందించటం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పందిరి నరసింహారావు, ఆర్టీసీ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఆచారి, లాలూనాయక్ తదితరులున్నారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే వారోత్సవాలు



గ్లోబల్ హ్యాండ్ వాష్ డే వారోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు

వెల్దుర్తి: గ్లోబల్ హ్యాండ్ వాష్ డే వారోత్సవాల సందర్భంగా మండలంలోని గుండ్లపాడు గ్రామంలోని పాఠశాలల్లో వాటర్ ఎయిడ్ ఎయిరిండియా ఆధ్వర్యంలో గురువారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ ఎయిడ్ ఎయిరిండియా కో ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, తరువాత, మరుగుదొడ్డి ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. చేతులు కడుక్కునే విధానాన్ని సభ్యులు రవివర్మ, లక్ష్మణరావు, రాజశ్రీ 20సెకన్ల పాటు ఆరు విడతల్లో చూపించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీకి ఎకరం భూమి కేటాయింపు



తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులకు భూమి పత్రాలు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు 75 త్యాళ్లూరు గ్రామంలో పూర్వ సమితి ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎకరం భూమి కేటాయించిన స్వాధీన పత్రాలను స్థానిక తహసీల్దార్ జియావుల్ హక్, టీటీడీ ప్రాపర్టీ తహసీల్దార్ మధుసూధనరావుకు గురువారం ప్రజలు పత్రాలు అందజేశారు. రూ. 2 కోట్ల నిధులతో 75 త్యాళ్లూరు గ్రామంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. దాతల వాటా ఇప్పటికే రూ. 40లక్షలు టీటీడీ వారికి చెల్లించారు. టీటీడీ ఏఈ జగన్‌మోహన్‌రావు, టి.బాలాజీ, సర్వేయర్ శివ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సి.శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయం సర్వేయర్ కోమలి, వీఆర్ఓ ప్రసాద్, జి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

చాకచక్యంగా చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఒకరి అరెస్టు.. ఇద్దరు పరారీ
- చోరీ అయిన 11 బైకుల విలువ రూ.11లక్షల 59 వేలు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ టి.బాలకృష్ణ, సౌందర రాజన్‌లు



స్వాధీనం చేసుకున్న బైకులతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

మాచర్ల: పట్టణంలో నెల రోజులుగా చోరీకి గురవుతున్న బైకులకు సంబంధించి అప్రమత్తమైన పోలీసులు నిఘాపెట్టి గురజాల సీఐ, మాచర్ల ఇన్‌చార్జి టి.బాలకృష్ణ, పట్టణ ఎస్ఐ సౌందర రాజన్‌లు బైకు దొంగలను గుర్తించి వారి వద్ద నుంచి 11 బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ టి.బాలకృష్ణ, ఎస్ఐ సౌందర రాజన్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల పట్టణానికి చెందిన మొగిలి నాగరాజు, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో వాహనాలను దొంగలించుకొని వెళ్తున్నారు. ఈ విధంగా నెల రోజుల్లో 11 ఫిర్యాదులు అందటంతో పూర్తిస్థాయిలో దృష్టి సారించి నిందితుడు మొగిలి నాగరాజును అదుపులోకి తీసుకొని విచారించగా 11 బైకుల చోరీకి పాల్పడినట్లు నిందితుడు వెల్లడించినట్లు పేర్కొన్నారు. బైకుల విలువ రూ.11,59,000 ఉంటుందని తెలిపారు. నిందితుడు నాగరాజును మాచర్ల మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. దొరికిన వాహనాల్లో మాచర్ల పట్టణానికి చెందిన 8, ఇతర ప్రాంతాలవి 3 ఉన్నట్లు వెల్లడించారు. అత్యంత చాకచక్యంగా బైకుల చోరీ కేసును పరిష్కరించిన పోలీసు అధికారులను, సిబ్బంది జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీలు అభినందించారు.

దేశ అభివృద్ధికి పాటుపడాలి



దాచేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దాచేపల్లి : దేశ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు పాటుపడాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం దాచేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలు త్యాగం చేశారని, మహనీయుల ప్రాణత్యాగం ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని, దేశం కోసం మంచి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, తహసీల్దార్ జీ కరుణకుమార్, ఎంపీడీవో శోభారాణి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సర్పంచ్‌లు కూసం నాగిరెడ్డి, షేక్ ఇమాంవలి, నెమలికొండ వెంకటచారి, వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీలు ఆకూరి వెంకటరెడ్డి, నంద్యాల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఏ దాడులకు నిరసనగా ర్యాలీ

పిడుగురాళ్ల: ఢిల్లీలో న్యూస్ క్లిక్ మీడియా చానల్‌పై ఎన్ఐఏ అక్రమదాడులు నిరసిస్తూ పట్టణంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాస్తవాలు మాట్లాడే వారిపై దేశద్రోహులు పేరుతో అక్రమ కేసులు పెట్టిస్తుందని, దానిలో భాగంగానే న్యూస్ క్లిక్ చానల్ పై దాడులు జరిపి సిబ్బంది సెల్ ఫోన్లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారని వారిపై కేసు నమోదు చేశారని అదేవిధంగా మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న పేరుతో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై ఎన్ఐఏ అక్రమ దాడులు జరిపి భయభ్రాంతులకు గురి చేస్తుందని వారు విమర్శించారు. ఎన్ఐఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని జర్నలిస్టులు, వామపక్ష సంఘాలపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు, భక్తుల వెంకటేశ్వర్లు, బాబు, రామకృష్ణ, సీపీఐ నాయకులు కృష్ణనాయక్, సుజాత, వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు నీలాద్రి రాంబాబు, అనిల్ కుమార్, కొండారెడ్డి, చెన్నయ్య, వెంకటస్వామి, ఎంసీపీఐ నాయకులు ఓర్పు కృష్ణ, భారత్ బచావో నాయకులు కోలా నవజ్యోతి, వివిధ ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా నా మట్టి- నా దేశం

అమర వీరులకు ఘనంగా నివాళులు



దుర్గి: భారత స్వాతంత్ర్య సమరంలో అమరులైన వీరులకు ఘన నివాళులు అర్పిస్తూ మండల ప్రజానీకం నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని గురువారం మండలం కేంద్రం దుర్గిలో వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ ఏచూరి సాయి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని వేరు వేరు కుండలలో ఉంచి తదనంతరం ఆయా కుండలను మండల కేంద్రానికి తరలించారు. బస్టాండ్ సెంటర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి 225 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది ర్యాలీగా మండల పరిషత్తు కార్యాలయానికి చేరుకున్నారు. మండల పరిషత్తు కార్యాలయం ఆవరణను పూలదండలు, మామిడి తోరణాలు, అరిటాకులతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి సేకరించిన కుండలలోని మట్టిని, బియ్యాన్ని మండలం తరపున ఏర్పాటు చేసిన కుండలలో ఉంచారు. ఈ కుండలను కలెక్టరేట్ కార్యాలయానికి తరలించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు చల్లా శ్రీనివాసరావు, ఊరుబండి ఏగయ్య, ఏఈ ఎస్.వెలిగొండ రెడ్డి, ఏఓ వై అమీర్‌రెడ్డి, ఎంపీటీసీలు కటకం గోపాల్, షేక్ హుస్సేన్, బొంత కృష్ణ, సర్పంచులు రాయపాటి మాణిక్యం, జి.వెంకటరెడ్డి, గొంది నాసరయ్య, నలబోతు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కటకం చిన వెంకటయ్య, తోటకూర వెంకటేశ్వర్లు, జంగా కొండలు, బుచ్చిబాబు, తోట మూర్తి, వివిధ గ్రామాల సెక్రటరీలు, వీఆర్‌ఓలు, అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేను వెంటనే పూర్తి చేయండి



భూ రీ సర్వేపై వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కమిషనర్, డీఈ, సర్వేయర్లు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేను పట్టణంలో వెంటనే పూర్తి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ పురపాలక సంఘ కమిషనర్లు, అధికారులతో సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎక్కడా రాజీ పడవద్దని, నోటీసులు జారీ చేసి ప్రతి భూమిని సర్వే చేసి సంబంధిత పత్రాలను పరిశీలించి పూర్తి అర్హత కలిగిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. ఎటువంటి అవకతవకలకు అవకాశమివ్వకుండా సమగ్ర సర్వేను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత కమిషనర్లు, సర్వేయర్లపై ఉందన్నారు. మాచర్లలో పురపాలక సంఘ కమిషనర్ ఈవీ రమణబాబు, డీఈ మధుసూదనరావు, ఆయా సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.